ఆకేపాటికి ఝలక్


ఆకేపాటి ఎస్టేట్‌లోని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్వగృహం

- ఎస్టేట్‌లో 31 ఎకరాల ప్రభుత్వ భూములు
- ఆన్‌లైన్ నుంచి ఆకేపాటి కుటుంబ సభ్యుల పేర్లు తొలగింపు
- ప్రభుత్వ భూములుగా నమోదు
- నేడో.. రేపో అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు
- మిగిలిన భూములపై కొనసాగనున్న విచారణ

రాయచోటి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి చెందిన రాజంపేట మండలం మందపల్లె గ్రామంలో 31 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఎస్టేట్ నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ భూములు ఆకేపాటి అమర్‌నాధరెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఆన్‌లైన్‌లో ఉన్నాయి. రెవెన్యూ అధికారుల విచారణలో ఈ భూములు ప్రభుత్వ భూములుగా తేలడంతో ఆన్‌లైన్‌లో ఆకేపాటి కుటుంబ సభ్యుల పేరు నుంచి తొలగించి అవన్నీ ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో నమోదు చేశారు. అదేవిధంగా ఆకేపాటి కుటుంబ సభ్యులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్న భూముల రిజిస్ట్రేషన్లను నేడో..రేపో రద్దు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారులు అవసరమైన డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మందపల్లె, ఆకేపాడు గ్రామాలలో పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి అందులో ఎస్టేట్ నిర్మించుకున్నాడని ముఖ్యమంత్రి కార్యాలయానికి గత ఏడాది నవంబరులో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు. ఈ విచారణలో 100 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఆకేపాటి ఎస్టేట్‌లో ఇప్పటి వరకు 31 ఎకరాలు ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు సమాచారం. ఇందులోనే ఎస్టేట్‌లోని ముఖ్య నిర్మాణాలు ఉన్నట్లు తెలుస్తోంది. కల్యాణమండపం వంటి కొన్ని నిర్మాణాలు పట్టా భూమిలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ భూముల వివరాలను వెబ్‌ల్యాండులో మార్చిన అధికారులు ప్రస్తుతం ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆయన భార్య జ్యోతమ్మ, తమ్ముడు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆయన భార్య సుజనల పేర్లు మీద 2023 మేలో జరిగిన రిజిస్ట్రేషన్ల మీద అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. ప్రభుత్వ భూములని స్పష్టంగా తెలిసినా నిబంధనలకు విరుద్ధంగా వీటిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో ప్రస్తుతానికి ఈ రిజిస్ట్రేషన్లను రద్దు చేయించే పనిలో జిల్లా అధికారులు ఉన్నారు. ఇందులో భాగంగా ఇందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో ఈ రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తారని సమాచారం. ఆకేపాటి ఎస్టేట్ విస్తరించి ఉన్న సుమారు 100 ఎకరాలలో ఇంకా ఏమైనా ప్రభుత్వ, డీకేటీ భూములు ఉన్నాయా? ఉంటే ఎన్ని ఉన్నాయి అని తేల్చేందుకు త్వరలోనే రెవెన్యూ బృందాలు ఎస్టేట్‌లోకి వెళ్లి విచారించవచ్చని తెలుస్తోంది.

వైభవోపేతం వీరభద్రుడి బ్రహ్మోత్సవం

- భక్తిశ్రద్ధలతో లింగోద్భవ పూజలు


పూజల అనంతరం ప్రత్యేక అలంకరణలో అఘోరలింగేశ్వరుడు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు వీరభద్రాలయంలో అఘోరలింగేశ్వరుడికి లింగోద్భవ పూజలు నిర్వహించారు. అలాగే గురువారం ఉదయం ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల బృందంచే వేదమంత్రోచ్చారణల మధ్య వీరశైవ ఆగమ ఆచారం ప్రకారం క్షేత్రపాలక హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బీజాపూర్‌కు చెందిన గీతశ్రీ, శంభు లింగ్ హోరలగి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ సమేత వీరభద్రుడు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు.

నాటుసారా రహిత జిల్లాగా చేయాలి

- నాటుసారాపై 14405 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాను నాటుసారా రహితంగా రూపొందించేందుకు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నాటుసారా నిర్మూలనలో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన నవోదయం 2.0 జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారాపై ప్రజల్లో అవగాహన కలిగించి పూర్తిగా నిర్మూలించడానికి ఈనెల 19న ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. నాటుసారా తయారు చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమని, 8 సంవత్సరాల జైలుశిక్షతో పాటు ఐదు లక్షల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు. జిల్లాలో ముఖ్యంగా 19 మండలాల్లో నాటుసారా తయారు చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. ఏ కేటగిరిలో ఆరు గ్రామాలు ఉన్నట్లు ఎక్సైజ్‌శాఖ వారు గుర్తించారన్నారు. ఈ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి నాటుసారా రహితంగా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ మధుసూదన్, డిప్యూటీ సూపరింటెండెంట్ జోగేందర్, ఎల్డీయం, డీఆర్డీఏ, పరిశ్రమలు, పంచాయతీ అటవీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

లంకమలలో శిలాశాసనాలు

- సర్వే చేసిన పురావస్తు, అటవీ అధికారులు


లంకమలలో పురాతన శాసనాలను సర్వే చేస్తున్న దృశ్యం



శాసనాలను పరిశీలిస్తున్న అటవీ, పురావస్తు శాఖాధికారులు

రాయచోటి/సిద్దవటం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా లంకమల అడవుల్లో గురువారం పురాతన శాసనాల కోసం ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ఆధ్వర్యంలో సర్వే జరిగింది. దేశంలో పురావస్తు శాఖ మొట్టమొదటిసారిగా సిద్దవటం రేంజ్‌లోని లంకమల రిజర్వు ఫారెస్టులో పురాతన శాసనాల కోసం సర్వే నిర్వహించారు. సిద్దవటం ఫారెస్టు రేంజ్ అధికారిణి కళావతి సహకారంతో ఈ సర్వే జరిగింది. ఈ సందర్భంగా 4వ శతాబ్దం నుంచి 8వ శతాబ్దానికి చెందిన 12 రకాల శాసనాలను ఈ సర్వేలో గుర్తించారు. పురావస్తు, అటవీ శాఖలకు చెందిన పలువురు అడవిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. కాగా అటవీ సంపదను కాపాడే చర్యల్లో భాగంగా సిద్దవటం ఫారెస్టు రేంజర్ కళావతి అడవిలో సంచరిస్తున్న సమయంలో కనిపించిన మానవ మనుగడ ఆధారాలను ఫొటోలు తీసి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ఆధ్వర్యంలో శాసనాలను పరిశీలించారు.

గంగమ్మ తల్లీ పాహిమాం...

- నేటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర

7



శేషాచలంలో ఆదిమానవుల ఆనవాళ్లు!



7

మనోహరం.. మల్లన్న రథోత్సవం

- మల్లన్న చెంత జాగారం చేసిన వేలాది మంది భక్తులు



రథంపై స్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు, ఆలయ ధ్వజస్తంభంపై అఖండ దీపం వెలిగిస్తున్న దృశ్యం(ఇన్‌సెట్‌లో)

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండ మల్లన్న రథోత్సవం నయన మనోహరంగా సాగింది. మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవోపేతంగా సాగిన బ్రహ్మోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి పరమశివున్ని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు ఉన్న ధ్వజ స్తంభంపై అర్చకులు ఈశ్వరప్ప అఖండ దీపం వెలిగించారు. ఈ దీపం కొండ కింద ఉన్న సుమారు 40 గ్రామాల వారికి కనపడుతుందని..దీపం చూసి శివరాత్రి ఉపవాసాలు ముగిస్తారని పెద్దలు చెబుతుంటారు. అనంతరం శివపార్వతుల ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపచేసి రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకూ ఆలయం చుట్టూ మెరవణి చేశారు. వేలాది మంది భక్తులు రాత్రి జాగారం ఉండి స్వామి వారి మెరవణిని తిలకించి తరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా డీఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో సీఐ లక్ష్మన్న, ఎస్ఐ లోకేష్‌రెడ్డిలు గట్టి బందోబస్తు నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు, వివిధ సేవా టికెట్ల ద్వారా మల్లయ్యకొండకు రూ.5,08,918 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మునిరాజ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శశికుమార్, కూటమి నాయకులు ఉత్తమ్‌రెడ్డి, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ గంగులొరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రమైన కలకడ ఝురి


కలకడ ఝురిలో కిక్కిరిసిన భక్తులు


ఝురిలో స్నానాలు చేస్తున్న భక్తులు

కలకడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేతా సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం జరిగిన ఝురి ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆ ప్రాంతం భక్తజన ప్రవాహంగా మారింది. సత్యవతి, బాహుదా నదులు సంగమంతో కొండ కోనల మధ్య ప్రవహించే ఝురిలో మునిగితే పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రి జాగరణ పూర్తి చేసుకున్న భక్తులు వేకువజాము నుంచే ఝురికి చేరుకుని పుణ్యస్నానాలు చేశారు. ఈ ప్రక్రియ సాయంత్రం వరకు నిరంతరంగా కొనసాగింది. రాయలసీమ నుంచే కాకుండా విజయవాడ, గుంటూరు, నెల్లూరు, హైదరాబాదు, చెన్నై, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఝురిలో స్నానాలు చేశారు. కాగా కలకడ, కలికిరి, కె.వి.పల్లె, కురబలకోట, సంబేపల్లె మండలాల నుంచి గ్రామదేవతలు, దేవరేద్దులను మాన్యాలతో తప్పెట్లు, పలకలు, పిల్లన్న గ్రోవులతో కోలాహలంగా ఊరేగింపుగా తీసుకొచ్చి ఝురిలో జలాభిషేకం చేశారు. మదనపల్లె-2 డిపో నుంచి 18 బస్సులు, పీలేరు డిపో నుంచి 10 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపినట్లు ఆర్టీసీ మేనేజర్లు అమరనాథ్, నిర్మలమ్మ తెలిపారు. ఝురి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ గురునాథ్ ఆధ్వర్యంలో బందోబస్తును పర్యవేక్షించారు.



గంగమ్మ తల్లీ... పాహిమాం...

నేటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర

భక్తుల కోర్కెలు తీర్చే అనంతపురం గంగమ్మతల్లి జాతర శివరాత్రి పర్వదినం ముగిసిన రెండో రోజు మాఘమాసం భహుళ అమవాస్య నుంచి అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారు తన పుట్టినిల్లు (చాగలగుట్టపల్లె) నుంచి సాంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా బయలుదేరి.. అనంతపురం గ్రామంలోని ఆలయానికి చేరుకోగానే జాతర ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే జాతరకు ఉమ్మడి కడప జిల్లా నుంచే కాకుండా రాయల సీమలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో వెల సిన గంగమ్మ జాతరను ఏడాది ఈనెల 28వ తేదీ శుక్రవారం నుంచి మార్చి 2వ తేదీ ఆదివారం వరకు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి మొక్కు బడులు ఉన్న వారు దీలు, బోనా లు సమర్పిస్తారు. కుంకుమబండ్లు, చాందిని బండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదర్శిస్తారు. ఇక జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్య క్రమాలు హరికథలు, చెక్క భజనలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలు, కళాకారు ల హస్య నటనలు, నృత్యాలు ఉంటాయి. అలాగే ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహు మతులు అందజేస్తారు. కాగా, జాత రకు వచ్చే భక్తుల కోసం నిర్వాహకు లు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు, ఎండలకు భక్తులు ఇబ్బందులు పడకుండా చలువపందిళ్లు, మహిళలకు ప్రత్యేక టాయిలెట్లు, స్నాన వాటికలు ఏర్పాటు చేశారు. ఇక జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అనంతపురం గంగమ్మ ఆలయం

అమ్మవారి చరిత్ర

కర్ణాటక రాష్ట్రంలోని అండి అనే ఊరు నించి గంగిరెద్దుల వారి ద్వారా అనంతపురం గ్రామంలో వెలసినట్లు పూర్వీకులు చెబుతారు. జాతరకు సమీపంలోని ప్యారంపల్లె అనే గ్రామంలోని తిమ్మిరెడ్డి ఉత్తారెడ్డి అనే రైతు పొలానికి కంచె వేయడానికి కంపచెట్లు కొట్టించి తొడుగులు వేయిస్తారు. కంప తొడుగును ఎద్దులకు కట్టి లాగిస్తే ఎంత సేపటికి కదలదు. ఆరోజు రాత్రి ఉత్తారెడ్డికి స్వప్నంలో అమ్మవారు ఈ ప్రాంతంలో వెలశానని.. కూలి పనికి వచ్చిన చెల్లు వంశీయులను పూజార్లుగా పెట్టి పూజలు నిర్వహించాలని చెప్పినట్లు పూర్వీకులు చెబుతారు. దీంతో అప్పటి నుంచి అమ్మవారికి బ్రాహ్మణులు కాకుండా చెల్లు వంశీయులు, యాదవులు పూజార్లుగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

జాతరకు చేరుకునే మార్గాలు

కడప-రాయచోటి నుంచి వచ్చే భక్తులు రామాపురం మండలం చిట్లూరు క్రాస్ వద్ద నుంచి గంగమ్మ జారతలోకి చేరుకో వచ్చు. రాయచోటి-వేంపల్లె నుం చి వచ్చే వారు రవీంద్రనగర్ మర్రిచెట్ట వద్ద నుంచి గానీ.. లక్కిరెడ్డిపల్లె రాచపల్లె నుంచి జాతరలోకి రావచ్చు.

కొత్త ప్రయోగాలతో ముందుకు సాగాలి

● ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్



ప్రయోగాలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న వీసీ విజయ్‌కుమార్

వేంపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి సమాజానికి ఉపయోగపడేవిధంగా కొత్త ప్రయోగాలు చేయాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అభియంత్ ఫెస్ట్-2025 కార్యక్రమాన్ని గురువారం వీసీ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా ల్యాబ్ కాంప్లెక్స్‌లలో సుమారు 20 మంది బృందాలుగా ఏర్పడి ప్రయోగాలను తయారు చేశారు. వాటిని పరిశీలించిన వీసీ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్తకొత్త ప్రయోగాలు చేసే వారికి ఆర్జీయూకేటీ చేయూతనిస్తుందని, ఆ దిశగా మరిన్ని ప్రయత్నాలు చేయాలన్నారు. అనంతరం ఫుడ్‌కోర్టులను సందర్శించారు. కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మైదుకూరు ఎద్దులకు మొదటి బహుమతి



బండలాగుతున్న ఎద్దులు

చాపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవాలయం వద్ద గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు ఎద్దుల పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మైదుకూరు పట్టణానికి చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎద్దులు 2049 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116 గెలుచుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 1920 అడుగులు లాగి రెండో బహుమతి రూ.70,116, రంగసాయిపల్లె గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు 1896 అడుగులు లాగి మూడో బహుమతి రూ.60 వేలు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ, దేవస్థానం ఈవో శ్రీనివాసులు, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ దార్ల గురివిరెడ్డి, టీడీపీ నాయకులు మేకల బాబు, వీరనారాయణ, కార్తీక్‌రెడ్డి, గోసుల క్రిష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తదితరులు బహుమతులను పంపిణీ చేశారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

జమ్మలమడుగు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో గురువారం తెల్లవారుజామున దండే హరీష్‌రెడ్డి (27) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన జరిగిన వెంటనే అక్కడున్న కొందరు రైల్వేస్టేషన్ సిబ్బందికి సమాచారం తెలియజేయడంతో వారు ఎర్రగుంట్ల, జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు విషయం తెలిపారు. వారు మృతదేహాన్ని పరిశీలించి.. సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలం కాకరవాడ గ్రామానికి చెందిన రాజమహేంద్రారెడ్డి కుమారుడిగా గుర్తించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కాగా, ఆ యువకుడికి ఉద్యోగం రాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు. అయితే మృతుడు ఆత్మహత్య చేసుకోవడానికి ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




సికెదిన్నె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని మద్దిమడుగు బిడికి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటసుబ్బయ్య (45) మృతి చెందాడు. పోలీసుల వివ రాల మేరకు.. రామాపురం మండలం శివశంకరాపురం గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య పనిమీద ద్విచక్ర వాహనంలో కడపకు వస్తుండగా ఆర్టీసీ బస్సు వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

శేషాచలంలో ఆదిమానవుల ఆనవాళ్లు!

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో ఆదిమానవుల ఆనవాళ్లు అనేకం ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతంలోని రాళ్లపై కనిపిస్తున్న చిత్రాలు మన దేశంలో ప్రాచీన మానవ జాడలను తెలియజేస్తున్నాయి. అప్పటి మానవుల జీవన శైలిని, విశ్వాసాలను అర్థం చేసుకునే మార్గాన్ని చూపుతున్నాయి. చెందిన ప్రాచీన మానవుడి సృజనాత్మకత, ప్రకృతితో అతని అనుబంధాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇవి మానవ నాగరికత పరిణామాన్ని అర్థం చేసుకునేందుకు విలువైన సమాచారాన్ని అందిస్తాయి. శేషాచల అడవుల్లోని పిత్యగల తీర్థం, యుధాగాల తీర్థం దగ్గర ఉన్న ఈ చిత్రాలను తిరుపతి జిల్లాకు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ గోవిందరాజుల భాస్కర్ వీటిని గుర్తించారు. ఈ చిత్రాలు అప్పట్లో ఈ అడవిలో ఉన్న జంతువుల గురించి చెపుతున్నాయని ఆయన వివరిస్తున్నారు.

ఈ చిత్రాలు సుమారు మెసోలిథిక్ కాలం (10,000 బీసీ - 8000 బీసీ) నాటివిగా భావిస్తున్నారు. జంతువుల చిత్రాల్లో జింక లు, గేదెలు, పక్షుల చిత్రాలు కనిపిస్తున్నా యి. వేటాడటం, ఆచారాలు పాటించడం వంటి చిత్రాలు ఆ కాలపు జీవన విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఆది మానవుడు ప్రకృతి నుంచి వచ్చిన ఎరుపు, పసుపు రంగు లు ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించా డు. ఇలాంటి చిత్రాలు తిరుమల సమీ పంలోని అడవుల్లో కూడా ఉన్నాయి. వాతావరణ ప్రభావంతో క్రమేణా ఈ చిత్రాలు నాశనమౌతున్నాయి. ఈ చిత్రాల పరిరక్షణకు అధికారులు కృషి చేయాల్సి ఉందని చరిత్ర పరిశోధకులు కోరుతున్నారు.. రైల్వేకోడూరు మండలం పూర్తిగా శేషాచలం అడవులను ఆనుకుని ఉంది.

ఈ అడవుల్లోని బండలపై ఆదిమానవుడు గీసిన చిత్రాలు చరిత్ర పరిశోధకులు, ప్రకృతి ప్రియులను ఆకర్షిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ చిత్రాలు దట్టమైన అడవుల్లో ఉండడంతో అందరికీ అందుబాటులో లేవు అధికారులు స్పందించి ఈ చిత్రాలను కాపాడే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరి శోధకులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



చిత్రాలను చూపుతున్న తిరుపతి జిల్లా పశుసంవర్ధకశాఖ ఏడీ గోవిందరాజుభాస్కర్, శేషాచలం అడవిలో రాళ్లపై ఆదిమానవులు గీసిన జంతువుల చిత్రాలు

పొలతల క్షేత్ర శివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.27,01,818లు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు.సేవకులు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పొలతల క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల ఆదాయం రూ.27,01,818లు వచ్చినట్లు ఆలయ ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. ఆలయంలో గురువారం ముగింపు ఉత్సవాలను అర్చకులు నిర్వహించారు. లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.4,50,000లు, సేవా టికెట్ల ద్వారా రూ.12,03,520, దుకాణాల ద్వారా రూ.74,000, తాత్కాలిక హుండీల ద్వారా రూ.10,47,798లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. శుక్రవారం శాశ్వత హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గండి దేవస్థాన ఈఓ వెంకట సుబ్బయ్య, ఆలయ సిబ్బంది, పోలీసులు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

● సిరిబండి కింద పడి వ్యక్తి మృతి
● ఆర్.తుమ్మలపల్లిలో విషాదం

చింతల గంగమ్మజాతరలో అపశ్రుతి



మృతి చెందిన సుదర్శన్

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): పులివెందుల మండల పరిధిలోని ఆర్.తుమ్మలపల్లి సమీపంలో గురువారం జరిగిన చింతల గంగమ్మ జాతరలో అపశ్రుతి చోటు చేసుకుంది. సిరిబండి ఊరేగింపు మహోత్సవంలో సిరి బండి కింద పడి ఆర్.తుమ్మలపల్లి గ్రామంలోని హరిజనవాడకు చెందిన ఎం.సుదర్శన్ (62) అలియాస్ గుండు మృతి చెందాడు. చింతల గంగమ్మ జాతరలో ఈ మూడేళ్లలో సిరిబండి కిందపడి మృతి చెందడం రెండోసారి. ప్రతి ఏడాది మహా శివరాత్రి పర్వదినం మరుసటిరోజు అంగరంగ వైభవంగా చింతల గంగమ్మ జాతర జరుగుతుంది. రెండేళ్ల క్రితం జడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి సిరిబండి కిందపడి మృతి చెందిన విషయం మరువకముందే మళ్లీ ఏడాది తరువాత మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఆర్.తుమ్మలపల్లిలో సిరిబండి ఊరేగింపు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బండి కింద పడడంతో బండిగాను సుదర్శన్ నడుముల మీద ఎక్కి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన గ్రామస్తులు సుదర్శన్‌ను హుటాహుటిన చికిత్స కోసం పులివెందులలోని వైఎస్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎం.సుదర్శన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జాతరలో సిరి బండి లాగుతున్న గ్రామప్రజలు

వైభవంగా జరిగిన జాతర

సిరిబండి జాతరలో అపశృతి ఏర్పడినప్పటికీ జాతర వైభవంగా సాగింది. ఆర్.తుమ్మలపల్లె గ్రామం నుంచి చింతల గంగమ్మ దేవస్థానం వరకు ఊరేగింపు నిర్వహించారు. గంగమ్మ దేవస్థానం వద్ద జాతర సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాల పరిమితిని మూడు నెలల పాటు 2025 మార్చి 1 నుంచి మే నెల వరకు పొడగించినట్లు డీఐపీఆర్వో వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

జిల్లాలో ఫిబ్రవరి 28 వరకు అక్రిడిటేషన్ కార్డుల గడువు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యాలు సంస్థలో పనిచేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి, కడప కార్యాలయానికి అందజేయాలని ఆ ప్రకటనలో డీఐపీఆర్వో కోరారు.

కుదేలవుతున్న టైలరింగ్ రంగం

● రెడిమేడ్‌వైపే ప్రజల ఆసక్తి
● డిజైనింగ్ బ్లౌజులపై మగువల మక్కువ
● నేడు టైలరింగ్ దినోత్సవం





కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వేలాది కుటుంబాలు దర్జీ పనిపై ఆధారపడి జీవించేవి. అయితే కుట్టు కూళ్ల భారం కావడంతో టైలర్ వద్ద బట్టలు కుట్టించేందుకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు రెడిమేడ్ బట్టలు విరివిగా రావడంతో యువత దానిమీద మోజుతో ఎక్కువ ఆసక్తి చూపిస్తూ కొనుగోలు చేయడం వల్ల దర్జీల దగ్గర బట్టలు కుట్టించుకునే వారు తక్కువ అవుతున్నారు. ఈ క్రమంలో టైలరింగ్ రంగంపై ఆధారపడిన వారి వృత్తికి ఆటంకం ఏర్పడుతోంది. వాస్తవంగా టైలర్ వద్ద ఒక ప్యాంట్, షర్టు కుట్టించుకుంటే రూ.1000 నుంచి రూ.1300 వరకు కూలి చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. కేవలం కుట్టుకూలితోనే రెడిమేడ్ వస్త్రాలు రావడం వల్ల వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజల ఆసక్తి చూపుతున్నారు. బట్టలు కుట్టడానికి అవసరమైన ముడిసరుకు కాన్వాసు, గుండీలు, హుక్కులు, దారాలు తదితర వస్తువులతో పాటు టైలరింగ్ షాపు బాడుగలు, కరెంటు బిల్లులు, నిర్వహణ భారం కావడంతో కుట్టుకూలీ ధర పెంచక తప్పడం లేదని టైలర్లు చెబుతున్నారు. అదేవిధంగా పండుగ వేళల్లో దర్జీల దగ్గర బట్టలిచ్చి కుట్టించుకునేంత సమయం లేకపోవడం వల్ల కూడా రెడిమేడ్ దుస్తుల కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు.

డిజైనింగ్ బ్లౌజులపై మక్కువ

ఒకానొక సందర్భంలో మగవారికి సంబంధించిన దుస్తులు కుట్టడంలో దర్జీలకు తగినంత పని లేనప్పటికీ మహిళలకు సంబంధించిన దుస్తులు కుట్టేందుకు డిమాండ్ ఏర్పడింది. వివిధ రకాల డిజైన్లు, వర్క్‌ల వల్ల మహిళా టైలర్లకు చేతినిండా పని లభిస్తుంది. ఒక బ్లౌజ్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు కుట్టుకూలి చెల్లిస్తున్న పరిస్థితి ప్రస్తుతం నడుస్తోంది. డిజైనింగ్, బొటిక్ పేర్లతో మహిళా టైలరింగ్ షాపులు నడుస్తున్నాయి. వర్క్ బ్లౌజ్‌పైన ఎక్కువ మంది మొగ్గు చూపడంతో డిజైనింగ్ బ్లౌజులకు మంచి డిమాండ్ ఉంది. బొటిక్ షాపుల నిర్వహణ కోసం కొన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు కూడా లేకపోలేదు. ఇందులో ప్రధానంగా బొటిక్ షాపును జనసంచారం ఎక్కువగా ఉండే చోట ఏర్పాటు చేసుకోవాలి. దీని వల్ల అద్దె ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఇక ఫ్యాషన్ పరిశ్రమ నిరంతర మారుతూ ఉంటుంది. తాజా ట్రెండ్స్ అనుసరించడం పోటీకి యజమానులకు ఒక సవాల్‌గా నిలుస్తుంది. అందుకోసమే వర్క్, డిజైన్ దుస్తుల కూలి రేటు కూడా ఎక్కువగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కాగా, సమాజంలో అన్ని రంగాల వారికి ప్రత్యేకమైన గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు టైలరింగ్ రంగంలో రాణిస్తున్న వారిని కూడా గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలనే అభిప్రాయం దర్జీల నుంచి వ్యక్తమవుతోంది.

కస్టమర్లు వెతుక్కుంటూ రావాలి



32 సంవత్సరాలుగా పైగా టైలరింగ్ రంగం లో ఉన్నాను. దర్జీలకు కొంతవరకు ఆదరణ తగ్గింది నిజమే. మన పనితీరే కస్టమర్లను ఆకట్టుకుంటుంది. కస్టమర్ల కోసం మనం ఎదురు చూడకూడదు. కస్టమర్లే మనను వెతుక్కుంటూ రావాలి. అందుకు అనుగుణంగా కుట్టు పనులలో నైపుణ్యం పెంచుకోవాలి.

-అర్జున్ టైలరింగ్ మాస్టర్, కడప

నెల ముందే దుస్తులు ఇచ్చేవారు



రెడిమేడ్ రంగం రాకముందు నెలరోజుల ముందే దుస్తులు తీసుకొచ్చి ఇచ్చేవారు. పండుగ సీజన్‌లో వస్తే వారం ముందు నుంచే కస్టమర్ల నుంచి దుస్తులు తీసు కెళ్లేవాళ్లం కాదు. కానీ పరిస్థితులు ఇప్పుడు మారిపోయాయి. రెడిమేడ్ రంగం రావడంతో టైలర్లకు కష్టకాలం మొదలైంది.

-గౌస్ టైలరింగ్ మాస్టర్, కడప

వైభవంగా తెప్పోత్సవం

సుండుపల్లె, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా సాగిన శివరాత్రి వేడుకలు గురువారంతో ముగిశాయి. ఇందులో భాగంగా సుండుపల్లె మండలంలోని తిమ్మసముద్రం పంచాయతీ చింతలయ్యగారిపల్లె శివాలయం ప్రాంగణంలో గురువారం తిరుణాల మహోత్సవంలో భాగంగా సిద్దేశ్వరుని తెప్పోత్సవం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి మరుసటి రోజున ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మధ్యాహ్నం నంది వాహనంపై సిద్దేశ్వరస్వామిని ఆశీనులు చేసి ఆలయ తూర్పు భాగంలో ఉన్న కోనేటిలో తెప్ప ప్రదక్షిణ చేసి తెప్ప ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను చూసేందుకు చుట్టుప్రక్కల గ్రామాలు, మండల నలుమూలల నుంచి భక్తులు తెప్పోత్సవంలో పాల్గొన్నారు. కోనేరులో మునిగి స్వామి వారికి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



సుండుపల్లి: సిద్దేశ్వరస్వామి ఆలయం ఎదుట కోనేరులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కన్నుల పండువగా వీరభద్రుడి కల్యాణం

చిట్వేలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాత చిట్వేలిలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి ఆలయంలో స్వామివార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం రేనాటి వినాయకరాజు కుమారుడు వెంకటసుబ్బరాజు బృందంచే భక్తి గతాలాపన, 9 గంటలకు పార్వతి పరమేశ్వరుల కల్యాణం, మధ్యాహ్నం జింక సంజీవ్ ప్రొద్దుటూరు వారిచే అన్నదానం చేశారు. మావిళ్ల హరీష్, గల్లా సుదర్శన్‌రావు, పిల్ల ఆనంద్, హిమత్‌గిరి, రాజశేఖర్, హరిక్రిష్ణ, దేవరాజ్‌లు, తిరుపతి అడ్వకేట్ బృందం ఉభయదారులుగా వ్యవహరించారు. టి.బీమ్‌సేన్ (హైదరాబాదు), టి.విశ్వనాథ్, గ్రామస్థులు ప్రత్యేక ఉభయదారులుగా వ్యవహరించారు. పురోహితులు మృత్యుంజయస్వామి కార్యక్రమాలను నిర్వహించారు.

అయ్యవారు రెడ్డిస్వామికి ఘనంగా పూజలు

సిద్దవటం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలపల్లె గ్రామం పెన్నానది ఒడ్డున వెలసిన అయ్యవారురెడ్డిస్వామి తిరుణాల సందర్భంగా ఆదివారం ఘనంగా పూజలు చేశారు. నిత్యపూజకోనలో జరిగే శివరాత్రి మహోత్సవాల మరుసటి రోజున నిత్యపూజస్వామిని దర్శించుకున్న భక్తులు మూలపల్లెలోని అయ్యవారు రెడ్డిస్వామిని కూడా దర్శించుకుని తిరుణాల నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి స్వామి వారికి పూజలు చేశారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. చెక్కభజనలు, పండరి భజనలు, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పౌరాణిక నాటకాలు ఉపాసి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఒంటిమిట్ట సీఐ పర్యవేక్షణలో సిద్ధవటం ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాత శింగనమలలో...

పెనగలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాత సింగనమలలో గల గురునాథీశ్వరుడు, కామాక్షమ్మ దేవాలయంలో శింగనమలకు చెందిన దివంగత మాజీ సర్పంచ్ గుండ్లూరు చిన్నయ్య, ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులు మల్లేశ్వరమ్మ, వెంకటేశ్, శివకుమార్, మల్లికార్జునల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కంబాలకుంట బీసీ కాలనీ, సింగారెడ్డిపల్లె కొత్తసింగనమల, గడ్డమీద హరిజనవాడ తదితర గ్రామాల ప్రజలు మూడు రోజులు ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తారు. శుక్రవారం కూడా కంబాలకుంట బీసీ కాలనీ ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లంకమల అటవీ ప్రాంతంలో పూజలు

సిద్దవటం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నిత్యపూజేశ్వర కోనలో బుధవారం రాత్రి శివపార్వతుల ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు తిలకించడానికి జనం పోటెత్తారు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశామన్నారు.

చెన్నకేశవస్వామికి పూజలు, పొంగుబాలు

సుండుపల్లె, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మడితాడు గ్రామ పంచాయతీ ఉప్పరపల్లె సమీపంలో వెలిసిన చెన్నకేశవస్వామికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పొంగుబాలు పెట్టి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పంతాలను భక్తులందరూ కలిసి ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. గురువారం రాత్రి శుక్రవారం తెల్లవారుజామున రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో సుమారు 10 చాందినీ బండ్లు దర్శనం ఇవ్వనున్నాయి. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, ఉప సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, కురవ సంఘం నాయకులు జయరాం, అశోక్, చెన్నరాయుడు, లాయర్ భాస్కర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధులయ్య జాగారం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీపీఆర్‌కండ్రిక గ్రామం లో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం వైభవంగా సిద్ధులయ్య జాగారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా టీడీపీ ఇన్‌ఛార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ హాజరయ్యారు. కూటమి నాయకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఎద్దుల బండ్లు కట్టారు. భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున జనాలు తరలి వచ్చారు.

మాలే పెద్దయ్యస్వామికి పూజలు

చిన్నమండెం, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): దేవగుడిపల్లె గ్రామ ఇలవేల్పు దేవుడైన మాలే పెద్దయ్యస్వామి తిరుణాల కన్నుల పండుగగా సాగింది. సెలగోలమ్మతో కలిసి జల్లావాండ్లపల్లె నుండి బాబూజీనగర్‌కాలనీ, దేవగుడిపల్లె, కుర్వపల్లి మీదుగా చింతోల్ల మాలి ఇంటింటి పూజలు అందుకుంటూ చేరుకున్న దేవరెద్దు తిరుణాల్లో భక్తులు పూజలు చేసుకున్నారు. పిల్లలు లేని మహిళలు పిల్లల కోసం దేవరెద్దుకు ముడుపలు కట్టుకున్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి హరితమ్మ, కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డి, సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు.



సుండుపల్లి: చెన్నకేశవస్వామి సేవలో భక్తులు



చిట్వేలి: కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



సిద్దవటం: అలంకరణలో అయ్యవారురెడ్డి స్వామి



పెనగలూరు: ప్రత్యేక అలంకరణలో కామాక్షమ్మ అమ్మవారు

ఘనంగా త్రేతేశ్వరస్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

రాజంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) :మండలం హత్యరాలలో గురువారం ఉదయం త్రేతేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు దంపతులు, ఉభయదారులు కొమ్మి చంద్ర, కవిత, విమలమ్మ స్వామివార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చారు. వీరిని దేవదాయశాఖ ఈవో కొండారెడ్డి పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం కామాక్షి, త్రేతేశ్వరస్వాములను గజవాహనంపై ఆసీనులను చేసి వేదపండితులు గణేష్, శశిదర్, పద్మనాభస్వామి వేదమంత్రోచ్చరణ మధ్య అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. పట్టువస్త్రాలు సమర్పించిన భక్తులకు, ఉభయదాతలకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. మన్నూరు సీఐ ఆలీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పలువురు దాతలు భక్తులకు మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లు ఇచ్చి దాహాన్ని తీర్చారు.



దేవరెద్దుకు పూజలు చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



వీపీఆర్‌కండ్రికలో సిద్దులయ్య జాగారం దృశ్యం

భక్తుల తొక్కిసలాటలో స్పృహ తప్పిన బాలుడు



బాలుడికి చికిత్స అందిస్తున్న దృశ్యం

సిద్దవటం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజేశ్వర ఉత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం భక్తుల తొక్కిసలాటలో వంతాటిపల్లెకు చెందిన విద్యార్థి జగదీష్ (13) స్పృహ తప్పి పడిపోయాడు. భక్తులు పంచలింగాల వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి తరలించారు. వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో సిద్దవటం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణీకి వైద్య పరీక్షలు

నిత్యపూజకోన, పంచలింగాల గుడి వద్ద బుధవారం రాత్రి ఓ గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో శివభక్తులు స్థానిక వైద్య శిబిరానికి తరలించారు. వైద్యాధికారిణి రంగలక్ష్మి మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం సిద్దవటం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సంబేపల్లె,ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, క్షయ వ్యాధి నివారణ విభాగపు ఏరియా వైద్యాధికారి రియాజ్‌బేగ్ తెలిపారు. గురువారం గున్నికుంట్ల, గురిగింజకుంట హెల్త్ సెంటర్లను సందర్శించారు.

పొదుపుతో ఆర్థిక సాధికారత : జేసీ

రాయచోటి కలెక్టరేట్ , ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ పిలుపునిచ్చారు.గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్బీఐ వారి ఆర్థిక పొదుపు వారోత్సవాలు 2025 ప్రచార పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 24 నుంచి ఆర్థిక వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఈ సంవత్సరం ఆర్థిక అక్షరాస్యత- మహిళల శ్రేయస్సు. అంశంపై నిర్వహిస్తున్నారన్నారు. పొదుపు చేసే వనిత సాధిస్తుంది ఘనత అనే నినాదంతో ఫిబ్రవరి 24 నుంచి జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. రిస్క్ డైవర్సిఫికేషన్, రుణాలు, క్రెడిట్ స్కోర్, గృహ బడ్జెట్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, సహాయ మేనేజర్ మన్సూరు బాషా పాల్గొన్నారు.

స్థల వివాదం.. వ్యక్తిపై దాడి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మంగళంపల్లెలో స్థల వివాదంలో దాడి చేశారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు....మంగళంపల్లెకు చెందిన మద్దిన శంకరయ్య తన పక్క ఇంటికి చెందిన మాచిన శివయ్యను రాయితో కొట్టడంతో తలకు గాయమైంది. ఈ మేరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఆరెమ్మ మాన్యం కాపాడాలని వినతి

సుండుపల్లె, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల నుంచి ఆరెమ్మ మాన్యం భూములను కాపాడాలని పెద్దమాదిగపల్లెకు చెందిన రామచంద్ర గురువారం తహసీల్దార్ దైవాదీనంకు ఫిర్యాదు చేశారు. పెద్ద మాదిగపల్లె సమీపంలో సర్వే నెంబర్ 699లో 7.09 ఎకరాలు మాన్యం భూమిని ఓ రాజకీయ నాయకుడు ఆక్రమించుకున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆక్రమణల నుంచి భూమిని కాపాడి ఆరెమ్మ గుడికి ఇప్పించాలని కోరారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత లేదు: జనసేన

చిట్వేలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం ప్రజాక్షేమం కోరే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీకి లేదనిజనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర విమర్శించారు. గురువారం చిట్వేలి జనసేన పార్టీ కార్యాలయంలో మండల నాయకులు మాదాసు నరసింహ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓబులవారిపల్లె మండలం వైకోట సమీపంలో శేషాచల అడవుల్లో జరిగిన ఏనుగుల దాడి ఘటనపై మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడిన తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ తప్పిదం వల్ల ఏనుగులు సంచరించాయనడం విజ్ఞత కోల్పోయి మాట్లాడటమేనన్నారు. ఏనుగులు వాటికి ఇష్టమైనచోట సంచరిస్తాయని, అది ప్రభుత్వ తప్పిదం ఎలా అవుతుందని ప్రశ్నించారు. సంఘటన జరిగిన కొన్ని గంటల్లోనే బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను అందించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు దక్కుతుందన్నారు.ఎర్రచందనం అక్రమ రవాణా వైసీపీకి పేటెంట్ అని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచిన 7 నెలల్లో అరవ శ్రీధర్ చరిత్ర సృష్టించారన్నారు. తమ నాయుడితో మాట్లాడి గంటల వ్యవధిలోని ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేయించిన ఘనత శ్రీధర్‌కే దక్కుతుందన్నారు.ముక్కా రూపానందరెడ్డి కుటుంబాన్ని విమర్శించడం తగదన్నారు. వారు బాధితుల పక్షాన నిలిచి మృతులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలతో పాటు అంత్యక్రియలకు రూ. 20 వేల చొప్పున ఇంటికి వెళ్లి అందించారన్నారు. జనసేన నాయకులు జోగినేని మణి, పగడాల వెంకటేశ్, మాదాసు నరసింహులు, మద్దెల వెంకటసుబ్బయ్య, పగడాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెన్నానదిలో గల్లంతైన విద్యార్థి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సిద్దవటం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):జ్యోతి గ్రామం పెన్నానదిలో బుధవారం సాయంత్రం గల్లంతైన విద్యార్థి మృతి చెందాడు. కడప రవీంద్రనగర్‌కు చెందిన ఎస్.షరీఫ్(17) తన మిత్రులు షేక్ షమీర్, షేక్ అహ్మద్ బుధవారం నిత్యపూజకోన, జ్యోతి సిద్దేశ్వరాలయాలను దర్శించుకుని పెన్నానదిలోని నీటిలో నడిచి వెళుతుండగా, షరీఫ్ గల్లంతయ్యాడు. తహసీల్దారు మాధవీలత ఆదేశాల మేరకు అగ్నిమాపక సిబ్బంది పెన్నా నదిలో సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం జ్యోతి సమీపంలో అతని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది అన్వర్‌బాషా, పి.రాజానాయక్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

సుండుపల్లె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బుర్రలదిన్నెపల్లెకు చెందిన అంజనమ్మపై అదే ఊరికి చెందిన శ్రీను కుటుంబీకులు దాడి చేసినట్లు గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణబాబు గురువారం తెలియజేశారు. బుధవారం సాయంత్రం కర్రలతో దాడి చేయడంతో గాయపడిన ఆమెను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ బాధితురాలికి చెందిన 2.03 సెంట్ల డీకేటీ భూమిని లాక్కునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ స్థలం కోసమే దాడి చేశారని ఆరోపించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం

నందలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో వెలసిన గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి గ్రామోత్సవం గురువారం సాయంత్రం అత్యంత ఘనంగా రెడ్డివారివీధి, డీఎంసీ రోడ్ అరవపల్లె మీదుగా బస్టాండు కూడలి వరకు కొనసాగింది. గ్రామోత్సంలో తమిళనాడు రాష్ట్రం ఈరోడ్డు వాస్తవ్యులచే కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏఎస్ఐ సుబ్బరాయుడు, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త కొత్తపల్లి శ్రీనివాసాచారి, రాజాచారి, పెంచలయ్య, గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

రేషన్‌షాపు ఆకస్మిక తనిఖీ



రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దారు అమరేశ్వరి

పెనగలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు పంచాయతీలోని రేషన్‌షాపు నంబరు 4, 5లను గురువారం సాయంత్రం తహసీల్దారు అమరేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌లో స్టాకు, నిల్వ ఉన్న రేషన్ బస్తాలను ఆమె పరిశీలించారు. షాపు నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నిత్యపూజ కోన హుండీ ఆదాయం రూ.10,26,926



హుండీ లెక్కింపు చేపట్టిన అధికారులు

సిద్దవటం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని నిత్యపూజేశ్వరాలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రూ.10, 26,926 నగదు, 1324 గ్రాముల వెండి, 2.650 గ్రాముల బంగారం వచ్చిందని ఎండోమెంట్ ఫెస్టివల్ ఆఫీసర్ సి.శివయ్య, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ సురేష్‌కుమార్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, సిద్దవటం, కడప పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారిద్దాం

- జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్‌కుమార్

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):అవగాహన కల్పించడం ద్వారా అన్న బాల్యవివాహాల నివారణకు కృషి చేద్దామని అన్నమయ్య జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆలయాల అధికారులతో పాటు, అర్చకులకు సమాచారం ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. ఆలయాల్లో బాల్యవివాహాలు జరిగితే సంబంధిత పురోహితులు శిక్షార్హులు అవుతారన్నారు. ఆలయాల్లో జరిగే వివాహాలకు సంబంధించి పెళ్లికూతురు, పెళ్లికొడుకు ఆధార్ కార్డులతో పాటు వయసు ధ్రువీకరణ పత్రాలు, టెన్త్ క్లాస్ మార్కుల జాబితా, బర్త్ సర్టిఫికెట్లు పరిశీలించి వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహం చేస్తే బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 ప్రకారం వివాహానికి సహకరించిన పురోహితులు, షామియానా సప్లై వారు, ఫోటో గ్రాఫర్స్ పెళ్లి కుదుర్చిన వారు, క్యాటరింగ్ వారు, పెళ్లికి హాజరైన వారు శిక్షార్హులు అవుతారన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే ఐసీడీఎస్ సీడీపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, మండల రెవెన్యూ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ అసిస్టెంట్, గ్రామ సచివాలయ అడ్మిన్, సెక్రటరీ, మహిళా సంరక్షణ అధికారి తదితరులకు సమాచారం అందించి అన్నమయ్య జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తయారు చేసేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని ఆయన కోరారు.

గంగమ్మ ఆలయానికి 10 డస్టుబిన్లు వితరణ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గంగమ్మదేవాలనాయనికి గురువారం 10 డస్ట్‌బిన్లను మానవతా మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీనాయక్, కేంద్ర కమిటీ సభ్యుడు ప్రసాద్‌యాదవ్, ఛైర్మన్ బాలసుబ్రమణ్యం, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా మానవతా సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా గంగమ్మ జాతరలో మానవత తరుపున వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, ఉచితంగా అందిస్తున్నామన్నారు. కన్వీనర్ శివయ్య, తెలుగయువత మండల అధ్యక్షుడు పక్కీరయ్యతదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నాలుగు నెలల జైలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నిందితుడికి నాలుగు నెలలు జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ గురువారం రాయచోటి అడిషినల్ జూనియర్స్ జడ్జి తీర్పు ఇచ్చారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడి పర్యవేక్షణలో పోలీసులు నిందితులకు కఠిన శిక్షలు వేస్తున్నారు. రాయచోటి అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రాయచోటి పట్టణంలోని రాయుడుకాలనీకి చెందిన పెదవీటి దావీదు గత ఏడాది ఆగస్టు 9 రాత్రి శిబ్యాల గ్రామ సమీపంలో గల ఎయిర్టెల్ టవర్ వద్ద దొంగలు రూ.24 వేలు విలువ గల మూడు అమరాజా కంపెనీకి చెందిన బ్యాటరీలు దొంగలించినట్లు పెట్రోలింగ్ గార్డు షేక్. మహమ్మద్‌గౌస్ ఫిర్యాదు మేరకు రాయచోటి అర్బన్ ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తరువాత విచారణ పూర్తి చేసి చార్జ్ సీటును దాఖలు చేశారు. రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ ఆధ్వర్యంలో కోర్టులో చార్జీషీటు దాఖలు చేయగా పబ్లిక్ ప్రాసికూటర్ మురళీ సాయికృష్ణనాయుడు వినిపించారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన భువనగిరిపల్లె జట్టు

రాజంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట డిగ్రీ కళాశాల మైదానంలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో భువనగిరిపల్లె జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా రాజంపేట యువకులు గెలుపొందారు. విజేతగా నిలిచిన భువనగిరిపల్లె జట్టుకు రూ.50116తో పాటు చాంపియన్ కప్‌ను దాత ఊటుకూరు చెంగల్‌రాయులు అందజేయగా రన్నర్‌గా నిలిచిన రాజంపేట జట్టుకు రూ.30116లతో పాటు ద్వితీయ చాంపియన్ కప్‌ను జనసేన నాయకుడు శ్రీనివాసరాజు అందజేశారు. పెనగలూరు జట్టుకు తృతీయ బహుమతి రూ.15116లతో పాటు తృతీయ చాంపియన్ కప్‌ను బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అందజేశారు. గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, టీడీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, ఊటుకూరు నాయకులు చంగల్‌రాయుడు, భువనగిరిపల్లె నాయకులు అబ్బిగారి గోపాల్, కోలాటం హరి, చలపతి, సుబ్బరాయుడు, వెంకటరాజంపేట సుధాకర్ పాల్గొన్నారు.



గంగమ్మ తల్లీ... పాహిమాం...

నేటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర

భక్తుల కోర్కెలు తీర్చే అనంతపురం గంగమ్మతల్లి జాతర శివరాత్రి పర్వదినం ముగిసిన రెండో రోజు మాఘమాసం భహుళ అమావాస్య నుంచి అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారు తన పుట్టినిల్లు (చాగలగుట్టపల్లె) నుంచి సాంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా బయలుదేరి.. అనంతపురం గ్రామంలోని ఆలయానికి చేరుకోగానే జాతర ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే జాతరకు ఉమ్మడి కడప జిల్లా నుంచే కాకుండా రాయల సీమలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో వెల సిన గంగమ్మ జాతరను ఏడాది ఈనెల 28వ తేదీ శుక్రవారం నుంచి మార్చి 2వ తేదీ ఆదివారం వరకు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి మొక్కు బడులు ఉన్న వారు దీలు, బోనా లు సమర్పిస్తారు. కుంకుమబండ్లు, చాందీని బండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదర్శిస్తారు. ఇక జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్య క్రమాలు హరికథలు, చెక్కభజనలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలు, కళాకారు ల హస్య నటనలు, నృత్యాలు ఉంటాయి. అలాగే ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహు మతులు అందజేస్తారు. కాగా, జాత రకు వచ్చే భక్తుల కోసం నిర్వాహకు లు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు, ఎండలకు భక్తులు ఇబ్బందులు పడకుండా చలువపందిళ్లు, మహి ళలకు ప్రత్యేక టాయిలెట్లు, స్నాన వాటికలు ఏర్పాటు చేశారు. ఇక జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘ టనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


అనంతపురం గంగమ్మ ఆలయం

అమ్మవారి చరిత్ర

కర్ణాటక రాష్ట్రంలోని అండి అనే ఊరు నించి గంగిరెద్దుల వారి ద్వారా అనంతపురం గ్రామంలో వెలసినట్లు పూర్వీకులు చెబుతారు. జాతరకు సమీపంలోని ప్యారంపల్లె అనే గ్రామంలోని తిమ్మిరెడ్డి ఉత్తారెడ్డి అనే రైతు పొలానికి కంచె వేయడానికి కంపచెట్లు కొట్టించి తొడుగులు వేయిస్తారు. కంప తొడుగును ఎద్దులకు కట్టి లాగిస్తే ఎంత సేపటికి కదలదు. ఆరోజు రాత్రి ఉత్తారెడ్డికి స్వప్నంలో అమ్మవారు ఈ ప్రాంతంలో వెలశానని.. కూలి పనికి వచ్చిన చెల్లు వంశీయులను పూజార్లుగా పెట్టి పూజలు నిర్వహించాలని చెప్పినట్లు పూర్వీకులు చెబుతారు. దీంతో అప్పటి నుంచి అమ్మవారికి బ్రాహ్మణులు కాకుండా చెల్లు వంశీయులు, యాదవులు పూజార్లుగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

జాతరకు చేరుకునే మార్గాలు

కడప-రాయచోటి నుంచి వచ్చే భక్తులు రామాపురం మండలం చిట్లూరు క్రాస్ వద్ద నుంచి గంగమ్మ జారతలోకి చేరుకోవచ్చు. రాయచోటి-వేంపల్లె నుంచి వచ్చే వారు రవీంద్రనగర్ మర్రిచెట్టు వద్ద నుంచి గానీ.. లక్కిరెడ్డిపల్లె రాచపల్లె నుంచి జాతరలోకి రావచ్చు.

రోడ్డు ప్రమాదంలో అటవీ ఉద్యోగి మృతి


రోడ్డుపైనే శేఖర్ మృతదేహం

గుర్రంకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో అటవీ ఉద్యోగి కే శేఖర్ (61) మృతి చెందాడు. అమిలేపల్లె క్రాస్ వద్ద జరిగిన సంఘటనపై పోలీసుల వివరాల మేరకు పెద్దమండ్యెం మండలం కలిచెర్ల వాసి శేఖర్ గుర్రంకొండ మండలం తరిగొండ పరిధిలో అటవీశాఖ బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి విధులను ముగించుకుని ద్విచక్ర వాహనంలో తరిగొండ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అమిలేపల్లె క్రాస్ వద్ద గుర్రంకొండ నుంచి ద్విచక్ర వాహనంలో తరిగొండ వైపు వస్తున్న ఫిరోజ్‌ఖాన్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైదులు పరీక్షించి శేఖర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

కలికిరి విద్యార్థికి జిల్లా స్థాయి చాంపియన్‌షిప్


అన్విత్‌కు అవార్డును అందిస్తున్న డీఈఓ సుబ్రహ్మణ్యం

కలికిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కలికిరి విద్యార్థి పి.అన్విత్ నందన్ జిల్లా స్థాయిలో 'ది వర్డ్ పవర్ చాంపియన్‌షిప్' అవార్డుకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయిలో పోటీకి అర్హత సాధించాడు. గురువారం రాయచోటి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రహ్మణ్యం ఈ అవార్డును అందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆంగ్లంలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముంబై కేంద్రంగా విభ లీప్ ఫర్ వర్డ్ సంస్థ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థ ఇటీవల వివిధ దశల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆంగ్లంలో ఎంత మేరకు పట్టు ఉందనే విషయాన్ని గుర్తించడానికి పోటీలు నిర్వహించింది. మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న అన్విత్ నందన్ ఆంగ్లంలో అత్యంత ప్రతిభ ప్రదర్శించి పాఠశాల స్థాయి దాటుకుని క్లస్టర్, మండల స్థాయిలను అధిగమించి జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర స్థాయిలో పోటీ పడటానికి ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి వాల్మీకిపురం మండల వ్యవసాయాధికారి హేమలత కుమారుడు. ఎంఈఓ కరీముల్లా, చింతమాకులపల్లె పాఠశాల హెచ్ఎం భారతి, ఉపాధ్యాయిని హసీనా అన్విత్ నందన్‌ను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా నెగ్గుకు రాగలడని ధీమా వ్యక్తం చేశారు.

వృషభ వాహనంపై సిద్ధేశ్వరుడు



కలకడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తులు బధవారం రాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు వృషభ వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో వాహనాన్ని విద్యుత్ దీపాలు, స్వామి, అమ్మవార్లను వివిధ పూల మాలలతో అలంకరించి బళ్లారి డ్రమ్ములు, బాణసంచా పేల్చుతూ వేడుకగా ఆలయం నుంచి ఎర్రయ్యగారిపల్లె మీదుగా కలకడ వరకు ఊరేగించారు. మహా శివరాత్రి పురస్కరించుకుని జిల్లాకు చెందిన వారేకాక కడప జిల్లా వివిధ ప్రాంతాల భక్తులు ఆలయం వద్ద జాగరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు విజయసారధి, సుబ్రహ్మణ్యంస్వామి, ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ, కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణనాయుడు, రెడ్డెప్పనాయుడు పాల్గొన్నారు.

కనుల పండువగా వీరభద్రస్వామి తిరునాళ్లు

ములకలచెరువు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కోనేటివారిపల్లె పంచాయతీ బత్తినివారిపల్లెలో గురువారం వీరభద్రస్వామి తిరునాళ్ల ఉత్సవం కనుల పండవగా నిర్వహించారు. స్వామి వారి ప్రతీకగా భావించే నెమలి ఈకల గొడుగును గ్రామంలో ఊరేగించారు. గొడుగు ముందు వాల్మీకి వీరుల కత్తిసాము అబ్బుర పరిచింది. అనంతరం ఇక్కడ ఆలయం లోపల జల దీపం వెలిగించారు. వీరభద్రస్వామి మహిమ కారణంగానే నూనెకు బదులు నీళ్లతో ఇక్కడ దీపం వెలుగుతుందని భక్తుల నమ్మకం. సోంపాళ్యంలో స్వామి వారి గొడుగు, కోట చౌడేశ్వరి, మల్లికార్జునస్వామి వార్లను, వీరభద్రస్వామి గొడుగును తలారివారిపల్లె, బత్తినివారిపల్లెలో ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరుగురు కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా కోడి పందెం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి ఐదు కోడి పుంజులు, రూ.3,150లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బూచిపల్లె గ్రామ సమీపంలో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కోడిపందెం ఆడుతున్న ఆరుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు పందెం పుంజులు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

గ్రూపుల్లో కామెంట్స్‌పై కలెక్టర్ సీరియస్

- బాధ్యులపై చర్యలకు ఆదేశం
- తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్


మదనపల్లె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల తొలగింపు సందర్భంగా రెవెన్యూ సిబ్బందిపై జరిగిన దాడి దృశ్యాలు వైరల్ కావడంతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

స్థానిక దేవతానగర్‌లో బుధవారం అక్రమ నిర్మాణాన్ని తొలగించే క్రమంలో ఆక్రమణదారుడు చలపతి, రెవెన్యూ ఆర్ఐ శేషాద్రిరావును దూషిస్తూ, దాడి చేసే వీడియో వైరల్ అయింది. ఆ వీడియోను వార్డు సచివాలయ ఉద్యోగి మున్సిపల్ వార్డు ఉద్యోగుల గ్రూపులో పోస్టు చేశారు. దానిపై అదే గ్రూపులో ఉన్న మరో ఉద్యోగి కామెంట్ చేశాడు. ఇది కూడా గ్రూపులో బాగా వైరల్ అయింది. అదే గ్రూపులో ఉన్న మున్సిపల్ వీఆర్వో రెవెన్యూ గ్రూపులోని వీఆర్వోల గ్రూపనకు పోస్టు చేశాడు. సెలవు, పండుగ అని చూడకుండా అధికారులు చెప్పినట్లు పనిచేస్తుంటే, మళ్లీ ఇలాంటి కామెంట్లు ఏంటని వీఆర్వోల సంఘమే కాదు.. రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని కొందరు వీఆర్వోలు..తహసీల్దార్ ధనంజయులు దృష్టికి తీసుకెళ్లడంతో ఆ పోస్టును ఫార్వర్డ్ చేశారు. ఈ మెసేజ్‌ను తహసీల్దార్.. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు, తర్వాత కలెక్టర్ శ్రీధర్‌కు ఫార్వర్డ్ చేశారు. దీన్ని గమనించిన కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. తహసీల్దార్‌కు ఫోన్ చేసి, ఎవరు పోస్టు చేశారో, ఎవరు కామెంట్ చేశారో గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో తహసీల్దార్.. మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు ఫోన్ చేసి, పోస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు. తాను కామెంట్ పెట్టిన ఉద్యోగితో మాట్లాడానని, పోస్టు ఆ ఉద్దేశంతో పెట్టలేదని చెప్పినట్లు కమిషనర్ సమాధానమిచ్చినా..ఆయన శాంతించలేదు. ఇప్పుడే చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే రెవెన్యూ ఉద్యోగ సంఘం నేతలు మాత్రం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలావుండగా, అక్రమ నిర్మాణాలు కూల్చివేతకు ఇద్దరే వెళ్లడం ఏంటని, ఇటీవల రెవెన్యూ కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఓ ఉద్యోగి మందలించినట్లు తెలిసింది. దీనిపై బాధితుడు, రెవెన్యూ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ముంబై - చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం పై ఓవర్‌పై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులు(40) గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... కనుగొండరాయస్వామిని దర్శించుకునేందుకు బైక్‌పై వచ్చిన పెద్దపాళ్యం వాసి శ్రీనివాసులు ఇంటికి తిరిగి వెళ్తుండగా బ్రిడ్జి మీద లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

శేషాచలంలో ఆదిమానవుల ఆనవాళ్లు!


చిత్రాలను చూపుతున్న తిరుపతి జిల్లా పశుసంవర్ధకశాఖ ఏడీ గోవిందరాజుభాస్కర్, శేషాచలం అడవిలో రాళ్లపై ఆదిమానవులు గీసిన జంతువుల చిత్రాలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో ఆదిమానవుల ఆనవాళ్లు అనేకం ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతంలోని రాళ్లపై కనిపిస్తున్న చిత్రాలు మన దేశంలో ప్రాచీన మానవ జాడలను తెలియజేస్తున్నాయి. అప్పటి మానవుల జీవన శైలిని, విశ్వాసాలను అర్థం చేసుకునే మార్గాన్ని చూపుతున్నాయి. చెందిన ప్రాచీన మానవుడి సృజనాత్మకత, ప్రకృతితో అతని అనుబంధాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇవి మానవ నాగరికత పరిణామాన్ని అర్థం చేసుకునేందుకు విలువైన సమాచారాన్ని అందిస్తాయి. శేషాచల అడవుల్లోని పిత్యగల తీర్థం, యుధాగాల తీర్థం దగ్గర ఉన్న ఈ చిత్రాలను తిరుపతి జిల్లాకు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ గోవిందరాజుల భాస్కర్ వీటిని గుర్తించారు. ఈ చిత్రాలు అప్పట్లో ఈ అడవిలో ఉన్న జంతువుల గురించి చెపుతున్నాయని ఆయన వివరిస్తున్నారు.

ఈ చిత్రాలు సుమారు మెసోలిథిక్ కాలం (10,000 బీసీ - 8000 బీసీ) నాటివిగా భావిస్తున్నారు. జంతువుల చిత్రాల్లో జింక లు, గేదెలు, పక్షుల చిత్రాలు కనిపిస్తున్నా యి. వేటాడటం, ఆచారాలు పాటించడం వంటి చిత్రాలు ఆ కాలపు జీవన విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఆది మానవుడు ప్రకృతి నుంచి వచ్చిన ఎరుపు, పసుపు రంగు లు ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించా డు. ఇలాంటి చిత్రాలు తిరుమల సమీ పంలోని అడవుల్లో కూడా ఉన్నాయి. వాతావరణ ప్రభావంతో క్రమేణా ఈ చిత్రాలు నాశనమౌతున్నాయి. ఈ చిత్రాల పరిరక్షణకు అధికారులు కృషి చేయాల్సి ఉందని చరిత్ర పరిశోధకులు కోరుతున్నారు.. రైల్వేకోడూరు మండలం పూర్తిగా శేషాచలం అడవులను ఆనుకుని ఉంది.

ఈ అడవుల్లోని బండలపై ఆదిమానవుడు గీసిన చిత్రాలు చరిత్ర పరిశోధకులు, ప్రకృతి ప్రియులను ఆకర్షిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ చిత్రాలు దట్టమైన అడవుల్లో ఉండడంతో అందరికీ అందుబాటులో లేవు అధికారులు స్పందించి ఈ చిత్రాలను కాపాడే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరి శోధకులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న వక్ఫ్ బోర్డు చట్టసవరణ బిల్లును రద్దు చేయాలని కాంగ్రెస్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు షాలిదాదా డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం మైనార్టీలకు అన్యాయం చేస్తూ పాలన చేస్తోందని దుయ్యబట్టారు. మైనార్టీలను డెబ్బతీయడీనికే పీఎం కంకణం కట్టుకుంటున్నారని ఆరోపించారు. మదనపల్లె సీనియర్ నేత రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ సమాజంలో ఎక్కడా లేనివిధంగా ముస్లిం మైనార్టీలపై వారికి వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి పన్నాగం పన్నుతున్నట్లు పేర్కొన్నారు.

ఈజీ మనికి అలవాటుపడి దాడులకు దిగుతున్నారు: సీపీఐ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27:(ఆంధ్రజ్యోతి): దేవతానగర్‌లో అక్రమాణాల తొలగించడానికివచ్చిన రెవెన్యూ అధికారులపైజరిగిన దాడిని సీపీఐ, కాంగ్రెస్ నేతలు ఖండించారు. మీడియా సమావేశంలో సీపీఐ నేతలు కృష్ణప్ప, సాంబశివ, మురళి మాట్లాడారు.

బాలిక అదృశ్యం - కేసు నమోదు

ములకలచెరువు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): టెన్త్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. బురకాయలకోట పంచాయతీకి చెందిన బాలిక రెండు రోజుల కిందట స్పెషల్ క్లాస్ ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బాలిక తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లెలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపారు. ఏర్పేడు మండలం శీతారాంపేట వాసి గంగాప్రసాద్ యాదవ్, చిన్నమండ్యెం మండలం, తుమ్మగొందికి చెందిన శంకర్‌రెడ్డి చౌకదుకాణాల బియ్యం లోడును మదనపల్లె గోదాముకు తరలించారు. టిఫిన్ తినేందుకు వస్తూ రోడ్డు దాటుతుండగా టాటా ఏసర్ ఢీకొనగా ఇద్దరు గాయాలపాలైయారు.

చింతల గంగమ్మజాతరలో అపశ్రుతి

- సిరిబండి కింద పడి వ్యక్తి మృతి
- ఆర్.తుమ్మలపల్లిలో విషాదం


మృతి చెందిన సుదర్శన్


జాతరలో సిరి బండి లాగుతున్న గ్రామప్రజలు

వైభవంగా జరిగిన జాతర

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): ఆర్.తుమ్మలపల్లి సమీపంలో గురువారం జరిగిన చింతల గంగమ్మ జాతరలో అపశృతి చోటు చేసుకుంది. సిరిబండి ఊరేగింపు మహోత్సవంలో సిరిబండి కింద పడి ఆర్.తుమ్మలపల్లి గ్రామం హరిజనవాడ వాసి ఎం.సుదర్శన్ (62) అలియాస్ గుండు మృతి చెందాడు. చింతల గంగమ్మ జాతరలో మూడేళ్లలో సిరి బండి కిందపడి మృతి చెందడం రెండోసారి. ఏటా మహా శివరాత్రి పర్వదినం మరుసటిరోజు వైభవంగా చింతల గంగమ్మ జాతర జరుగుతోంది. రెండేళ్ల కిందట జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి సిరిబండి కింద పడి మృతి చెందిన విషయం మరువకముందే మళ్లీ ఏడాది తరువాత మృతి చెందాడు. ఆర్.తుమ్మలపల్లిలో సిరిబండి ఊరేగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బండి కింద పడడంతో బండిగాను సుదర్శన్ నడుముల మీద ఎక్కి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన గ్రామస్తులు సుదర్శన్‌ను హుటాహుటిన చికిత్స కోసం పులివెందులలోని వైఎస్ఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలు ముకున్నాయి. ఎం.సుదర్శన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిరిబండి జాతరలో అపశృతి ఏర్పడినా జాతర వైభవంగా సాగింది. ఆర్.తుమ్మలపల్లె నుంచి చింతల గంగమ్మ దేవస్థానం వరకు ఊరేగింపు నిర్వహించారు. గంగమ్మ దేవస్థానం వద్ద జాతర సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టూపక్కల గ్రామాలు, జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సీటీఎంలో అక్రమ నిర్మాణాల తొలగింపు

అంగళ్లు రోడ్డులో సర్వే మరిన్ని గుర్తింపు


సీటీఎం క్రాస్‌రోడ్డులో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తీగ లాగితే డొంక కదిలినట్లు ఎక్కడో సంఘటన జరిగితే, మరోచోట దాని మూలాలు బయట పడుతున్నాయి. నిందితునికి సంబంధించిన నిర్మాణాలే కాదు.. దానికి ఆనుకుని ఉన్న అలాంటి నిర్మాణాలకు కూడా ఊనంవచ్చింది. వివరాల్లోకెళ్తే.. స్థానిక దేవతానగర్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండగా, ఆర్ఐ శేషాద్రిరావుపై ఆక్రమణ దారుడు చలపతి దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సీరియస్‌గా తీసుకున్నారు. నిందితుడి వివరాలు సేకరించారు. సీటీఎం క్రాస్‌రోడ్డు, అమ్మచెరువుమిట్ట, బి.కె.పల్లె ఏరియాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. వీటిపై చర్యలు తీసుకునే క్రమంలో బుధవారం సీటీఎం క్రాస్‌రోడ్డు, బి.కె.పల్లె, అమ్మచెరువు మిట్ట ఏరియాలో కొన్నింటిని తొలగించారు. కొనసాగింపుగా గురువారం కూడా తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఈ క్రమంలో అంగళ్లురోడ్డులోని నిందితుడు చలపతికి చెందిన షట్టర్‌గదిని ఖాళీ చేయించారు. ఇందులో ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ వస్తువులు, అందులో దుకాణదారుల నుంచి ఖాళీ చేయించారు. ముందుగా ఆ రూమును తీసుకుని రెండు విద్యుత్తు కనెక్షన్లు తొలగించి, కూల్చివేత పనులు మొదలు పెట్టారు. దీన్ని ఆనుకుని వైన్‌షాపు నడుపుతున్న రూము కూడా అక్రమంగా నిర్మించినట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు దాన్ని కూడా కూల్చేందుకు ప్రయత్నించారు. అయితే అందులో సరుకు ఉందని, ఒకరోజు గడువిస్తే.. మరోచోటికి తరలిస్తామని తహసీల్దార్ నుంచి అనుమతి తీసుకున్నట్లు చెబుతున్నారు. అంతలోపు స్టాకు తరలింపు, రూముకు రికార్డులు ఉంటే చూపించాలని రెవెన్యూ అధికారులు సూచించారు. అయితే సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు సీటీఎం క్రాస్ రోడ్డులో సర్వే చేపట్టి, ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వారికి ఏదైనా రికార్డులు ఉంటే తేవాలని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు. సీటీఎం క్రాస్‌రోడ్డులోని ప్రభుత్వ లేఅవుట్‌లో అనధికారికంగా రోడ్డుకు అడ్డంగా నిర్మించిన పునాదిని కూడా తొలగించారు. స్థానికులు కొందరు.. అక్కడే ఉన్న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో పునాదిని తొలగించినట్లు తొలగించినట్లు చెబుతున్నారు. ఇక్కడ చాలామంది ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి అమ్మేసినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు చెబుతున్నారు. సర్వే చేపట్టి ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోనున్నట్లు రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి. ఆక్రమణల తొలగింపులో తహసీల్దార్, సర్వేయర్ రెడ్డిశేఖర్ బాబు, సీఐ కళా వెంకటరమణ, వీఆర్వోలు భరత్, మునుస్వామినాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం



దాతలకు స్వాగతం పలుకుతున్న శివాలయం ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, విజయభారతి హైస్కూల్ చైర్మన్ ఎస్.సేతు పేర్కొన్నారు. గురువారం మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపైన వెలసిన శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సేతు, చలపతి పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల కమిటీ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు సేతు, చలపతికి పూలమాలలు వేసి, పూర్ణకుంభ స్వాగతం పలికారు. దాతలు మాట్లాడుతూ ఏటా మల్లయ్యకొండలో శివరాత్రి జాతర పురస్కరించుకుని తంబళ్లపల్లె మల్లయ్యకొండ మాజీ చైర్మెన్ కనుగొండ మద్దిరెడ్డి, కువైట్ మాధవరెడ్డిలతో కలసి విరాళాలు అందిస్తున్నామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బైగారి శశి, పి.శశికుమార్, లావణ్య, వెంకటరమణ నాయుడు పాల్గొన్నారు.

ఐదుగురు జూనియర్లకు పదోన్నతి

మదనపల్లె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య, తిరుపతి జిల్లాల రెవెన్యూ విభాగాల్లో పనిచేస్తున్న ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి సీనియర్ అసిస్టెంట్లగా పదోన్నతి కల్పిస్తూ, ఆయా మండలాల్లో ఖాళీ స్థానాల్లో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) నియమించారు. రామసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఇమ్రాన్‌ను పెద్దమండ్యం ఆర్ఐగా, తిరుపతి కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్ సయ్యద్ మొహమ్మద్ షరీఫ్‌కు రాయచోటి కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. తిరుపతి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కె.లోకేష్‌ను సంబేపల్లె తహసీల్దార్ కార్యాలయానికి, బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కె.భరత్‌ను మదనపల్లె ఆర్ఐగా, స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జె.యతీషను కలికిరి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే



కార్పొరేషన్ రుణాల ఉత్తర్వులను చూపుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసం గ్లోరీ పాస్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు ఆధ్వర్యంలో సబ్సిడీ రుణాల ఉత్తర్వులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. వైసీపీ పాలనలో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలను ఓటు బ్యాంకుగానే వాడుకుందని, సీఎం చంద్రబాబు, క్రిస్టియన్ కార్పొరేషన్‌కు రూ.486 కోట్ల నిధులు విడుదల చేసి కార్పొరేషన్ ద్వారా క్రైస్తవులు ఆర్థికంగా ఎదిగేందుకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాచవేటివారిపల్లె సర్పంచ్ మధు, టీడీపీ క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు రాజేష్, పాస్టర్లు దేవమణి, దివాకర్, జీవరత్నం, శోభ నిర్మల, కృప, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మల్లిక

కురబలకోట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సాధించవచ్చని ఎన్ఐటీటీటీఆర్ ప్రొఫెసర్ మల్లిక పేర్కొన్నారు. గురువారం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ఆగ్మెంటెడ్ రియాలిటీ వర్చువల్ రియాలిటీ ఎంపికలు' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు తమలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సాఫ్ట్‌వేర్ అనేక మార్పులు జరుగుతున్నాయని వాటికి తగ్గట్టు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. సాంకేతిక పురోభివృద్ధి వృత్తిపర నైపుణ్యం తగ్గించడానికి నైపుణ్యాలను ప్రదర్శించాలని, వీటిపై ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో మెరుగైన ఉద్యోగవకాశాలున్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన పరిశోధనలకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రతి అవకాశాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకుని సమయస్ఫూర్తితో ఎదుర్కొనాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రామనాథమ్, కోఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.50వేలు విరాళం



విరాళం అందచేస్తున్న సాయిలోకేష్

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి సోషియల్ వేల్ఫేర్ అసోసియేషన్(అన్నదాన ట్రస్ట్)కు జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్ రూ.50 వేలు విరాళం అందచేశారు. మహాశివరాత్రి రోజు సాయి లోకేష్ బీజేపీ మండల నేతలతో కలిసి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండ కింద అన్నదానానికి రూ.50వేలు విరాళాన్ని ట్రస్టు చైర్మెన్ రాజశేఖర్‌రెడ్డికి అందజేశారు. బీజేపీ మండల కన్వీనర్ వెంకట్రమణ, అసెంబ్లీ కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య, మాజీ మండలాధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులు అమ్మవారి ఆలయ కుంబాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ తెలిపారు. ఆలయం పునఃనిర్మాణం చేసి 12 ఏళ్ళు అవుతున్న సందర్భంగా మహా కుంభాభిషేకం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి రెండో తేదీ వరకు మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మెదటి రోజు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి ఆశీస్సులతో ప్రారంభ మౌతుందన్నారు. కుంభాభిషేకానికి మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. మహోత్సవాల్లో ఆర్యవైశ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



విశేష అలంకరణలో కామేశ్వరస్వామి (వాల్మీకిపురం)

మిన్నంటిన హర నామస్మరణ

కన్నుల పండువగా సంగమేశ్వర రథోత్సవం ● ఆధ్యాత్మిక గురువు బాలకృష్ణ స్వామిజీ హాజరు

వేడుకగా శివపార్వతుల కల్యాణం ● తవళం శివాలయానికి పోటెత్తిన భక్తులు





పెద్దతిప్ప సముద్రంలో రథంపై ఊరేగుతున్న పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి - వాల్మీకిపురం కోనేటి వీధి ఆలయంలో శివపార్వతుల కల్యాణం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, రూరల్ మండలాల్లో నెలకొన్న శివాలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి భక్తులు జాగారణ నిర్వహించి గురువారం ఉదయాన్నే శైవక్షేత్రాలను దర్శించుకున్నారు. నీరుగట్టువారిపల్లెలో నీలకంఠేశ్వరస్వామిని ఆలయ ధర్మకర్తలు గుడి రామాంజులు, శివశంకర ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వైభవంగా ఊరేగించారు. నీరుగట్టువారిపల్లె వాసి రామాంజులు సిల్క్ శారీస్ అధినేత తమ కుటుంబీకులు దండు ఆనంద్, వెంకటరమణ, వెంకటనాగులమ్మ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నలగుట్లపల్లె రమణ, మర్రిపాటి రమేష్, చేనేత కార్మిక సంఘం నేతలు రామ్మోహన్ పాల్గొన్నారు. మంజునాథ స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. వేంపల్లె మల్లయ్యకొండలో మల్లేశ్వరస్వామిని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, టీడీపీ నేతలు బైరాగి మధు, వెంకటరమణ నాయుడు, సుబ్రహ్మణ్యం, చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. శాస్త్రివీధిలోని బసవన్న కట్ట దేవాలయంలో జనసేన నేత మైఫోర్స్ మహేష్ పూజలు నిర్వహించారు. చిప్పిలిలోని మడికయ్యల శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శంచుకున్నారు. సీటీఎం గెవిగంగాధరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోటెత్తిన సంగమేశ్వర ఆలయం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పాపాఘ్ని నదీ తీరాన వెలసిన పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం టి.సదుం గ్రామం చెన్నరాయునిపల్లె సమీప సంగమేశ్వరస్వామి ఆలయ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు బాలకృష్ణ రథోత్సవం ప్రారంభించారు. పార్వతీ సమే త సంగమేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తులను రథంలో ప్రతిష్ఠించారు. భారీగా భక్త జనసందోహం నడుమ హరహర ధ్వనులు మిన్నంటాయి. రథోత్సవం తిలకించేందుకు మాజీ లోకాయుక్తా జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ పరిశీలకులు గురువారెడ్డి, టి.సదుం సర్పంచ్ శారద, మునికృష్ణ, ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విరూపాక్షేశ్వరుడి ఊరేగింపు

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి ఉత్సవ మూర్తులను ఆధ్యాత్మిక వేత్త పట్టాభిరామయ్య అధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కోలాటలు, చెక్కభజనలతో స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు.

భక్తులతో కిటకిటలాడిన తవళం

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తవళం అటవీ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. నేల మల్లేశ్వరాస్వామి ఆలయం గురువారం పగటి తి రుణాళ్లకు మండల నలమూలల నుంచి భక్తులు తండోప తండాలుగా విచ్చేసి శివయ్యను దర్శించు కున్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్వామి వా రిని దర్శించుకున్నారు. నేలమేల్లేశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల కోసం ఆర్టీసీ వారు13 ప్రత్యేక బస్సులను నడిపారు. ఈఓ మంజుల, తాత్కాలిక చైర్మన్ రామకృష్ణ, ట్రస్టుసభ్యులు రెడ్డెప్పరె డ్డి, సర్పంచ్ రెడ్డెప్ప, కార్యదర్శి గౌతమి, రాజన్న, పాల్గొన్నారు.



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దండు రామాంజులు కుటుంబసభ్యులు

కనుల పండువగా కల్యాణం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల శివాలయాల్లో శివపార్వతుల కల్యాణ వేడుకలు విశేష భక్తజనం నడుమ కన్నుల పండువగా సాగాయి. శివరాత్రి పండుగ సందర్భంగా బుధవారం రాత్రి కోనేటివీధి శివాలయం, పొలిమేర ధర్మపథం ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. వీరభద్రాద్రి (వీరన్నకొండ)పై బుధవారం రాత్రి భక్తుల జాగరణ, వీరభద్రస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటిగడ్డ శివాలయం, చింతపర్తి ఓబులేశ్వరస్వామి ఆలయాల్లో కూడా విశేష పూజలు నిర్వహించారు. ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు సాలిగ్రామ శ్రీనివా సాచార్యులు, గోనవరపు శీనాస్వామి, అనిల్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు

కురబలకోట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగళ్లు సమీపంలో వెలసిన మల్లయ్యకొండ, కంటేవారిపల్లె సమీపంలో మల్లేశ్వర స్వామి ఆలయాల్లో గురువారం శివరాత్రి వేడుకలను నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా జంగమోడి జాతర

వేడుకగా అడవిపల్లె మద్దుండాల మల్లేశ్వరుడి ఉత్సవం ● పురవీధుల్లో విహరించిన కాశీ విశాలాక్షి, కాశీ విశ్వేశ్వరుడు





జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేవీపల్లె జంగమదేవరలు - పీలేరు కాశీవిశ్వేశ్వరుడి త్రిశూల స్నానం

పీలేరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మద్దుండాల మల్లేశ్వరుడి జాతరలో పీలేరు సహా పరిసర ప్రాంత ప్రజలు పోటెత్తారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జాతరకు తరలి వచ్చిన భక్తులతో అడవిపల్లె అటవీ ప్రాంతం కిటకిట లాడింది. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సంతాన లేమితో బాధపడుతున్న మహిళలు ఆలయ సమీప ఝరిలో పవిత్ర స్నాన మాచరించి గురువారం ఉదయం స్వామి ఎదుట వరపడ్డారు. అడవిపల్లె, తలపుల, కేవీపల్లె తదితర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన జంగమదేవరలు, దేవరెద్దులు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతర కోసం తరలి వచ్చిన భక్తుల కోసం తలపుల, పీలేరు ఆర్యవైశ్య సంఘం, భక్తులు అన్న దానం చేశారు. ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు నిర్మించి స్వామి వారి దర్శనం త్వరితగతిన జరిగేలా కమిటీ చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో పర్యవేక్షించారు. అటవీ ప్రాంతం కావడంతో అగ్నిప్రమాదాలు జరగకుండా పీలేరు అటవీ శాఖ రేంజర్ ప్రియాంక, ఎఫ్‌బీఓ సబిహా సుల్తానా నేతృత్వంలో అటవీ సిబ్బంది పహారా కాశారు. తలపుల పీహెచ్‌సీ సిబ్బంది ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మరోవైపు పీలేరు పట్టణంలో నూతన వధూవరులైన కాశీ విశాలాక్షి, కాశీ విశ్వేశ్వరుడు గురువారం ఉదయం ప్రధాన వీధుల్లో విహరించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి అత్యంత ప్రీతి పాత్రమైన త్రిశూలానికి బడబళ్లవంక వద్ద స్నానం చేయించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు డోలోత్సవం నిర్వహించారు. శివరామపురంలోని భ్రమరాంబ మల్లికార్జునుడికి గురువారం ఉదయం ఝురిస్నానం, షోడపచార పూజలు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆయా ఆలయాల ఉత్సవ కమిటీ సభ్యులు వారణాశి మోహన్ రెడ్డి, సభ్యులు సుధాకర, విజయ్ కుమా ర్, సుమన్, సాయి, ఉద్యా ఫణీంద్రశర్మ, మయూర్ నాథ శర్మ, అబ్బవరం అమరనాథరెడ్డి, మురళీ నాయునివారు, హరి, తదితరులు పాల్గొన్నారు.

గోరక్ష మహాసంఘ్ అధ్యక్షుడిగా అష్రఫ్



నియామక పత్రం అందుకుంటున్న వేంపల్లె అష్రఫ్

మదనపల్లె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ గోరక్ష మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడిగా వేంపల్లె అష్రఫ్‌ను నియమిస్తూ, జాతీయ కార్యదర్శి అయూబ్‌ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం నియామక పత్రం అందుకున్న ఆయన మాట్లాడుతూ ఈ పదవితో సంఘంలో బాధ్యత మరింత పెరిగిందని, శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. త్వరలోనే రాష్ట్రకమిటీని ఏర్పాటు చేసి, అక్రమంగా తరలుతున్న గోవులను అడ్డుకుంటానన్నారు. ఇందులో టీపీఎస్ నాగరాజా, అమరేంద్ర, కృష్ణప్ప, బుజ్జి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై దృష్టి పెట్టండి



డీఏఓకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు విన్నవించారు. గురువారం సబ్‌కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రకు సీపీఎం నేతలు వినతి పత్రం అందించారు. పట్టణం సహా మండలంలో విలువైన ప్రభుత్వ భూములను వైసీపీ పాలనలో కబ్జాలు చేశారన్నారు. ఇప్పుడు ఈ కబ్జాలను తొలగించేందుకు వెళ్లిన అధికారులపై కొందరు దాడులు చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులను బృందాలుగా క్షేత్రస్థాయిలో పంపి ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కోశాధికారి హరీంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భ్రమరాంబిక మల్లికార్జునుల కల్యాణం



కలికిరి పూలకొండలో భ్రమరాంబిక మల్లికార్జునుల కల్యాణోత్సవం

కలికిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా పూలకొండలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గుట్టపాలెం పంచాయతీ పూలకొండ ఆలయంలో శివరాత్రి కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజులుగా శివ నామస్మరణలతో పూలకొండ ప్రతిధ్వనించింది. గురువారం కల్యాణోత్సవానికి భక్తులు పోటెత్తారు. పరిసర మండల, గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణోత్సవానికి హాజరయ్యారు. నిర్వాహకులు రెడ్డెప్ప నాయుడు, డాక్టర్ వెంకటస్వామి భక్తులకు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అన్నదానం నిర్వహించారు. వీహెచ్‌పీ నేత చింతపర్తి మహేష్ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

మానిటరింగ్ సమావేశాలు నిర్వహించాలని వినతి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో గతంలో మాదిరి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని మాల మహానాడు జిల్లా నేతలు వెంకటస్వామి, శివయ్య కోరారు. గురువారం తహసీల్దార్ పామిలేటిని కలిసి వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ మండలంలో పదివేలకు పైగా మాలలు ఉన్నారని ప్రతి గ్రామంలో భూములు, దారి, శ్మశాన వాటిక సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించి పరిష్కార చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో మాలమహానాడు మండలాధ్యక్షుడు నాగార్జున, జిల్లా సెక్రటరీ సుధాకర్, సంఘ నేతలు శ్రీనివాసులు, రఘు, ప్రవీణ్, చిరంజీవి, జయచంద్ర, వేమన్న, మహేష్, గురుప్రసాద్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలపై హర్షం

పీలేరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఈద్గాహ్ మైదానం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేయడంపై ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. ఈద్గాహ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లి మాట్లాడుతూ మైదానంలో పూర్తిగా సిమెంటు ఫ్లోరింగ్ లేకపోవడంతో నమాజుకు ఇబ్బందిగా ఉండేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల ఇమామ్, మౌజన్ జీతాలను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. టీడీపీ నేతలు లడ్డూ జాఫర్, మల్లెల రెడ్డిబాషా, ఇమ్దాదుల్లా, షౌకత్ అలీ, ఆతిఖా షఫీ, అతార్ చాన్ బాషా, రహంతుల్లా, కేజీఎస్ రెడ్డిబాషా, నౌలాక్, పఠాన్ మౌలా, మహబూబ్ బాషా, ముతవల్లీ, ఇమామ్, మౌజన్‌లు పాల్గొన్నారు.

ఆటోమేటివ్ ఎలక్ట్రానిక్‌పై పట్టుసాధించాలి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, ఆటోమేటివ్ ఎలక్ట్రానిక్ సబెక్టులపై పట్టు సాధించాలని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం విద్యార్థులకు రెండు రోజులపాటు ఇన్నోవేషన్, టెలీకమ్యూనికేషన్‌పై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ఈసీఈ హెచ్‌ఓడీ వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మేళ్లచెరువులో సివిల్ రైట్స్ డే

పీలేరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మేళ్లచెరువు పంచాయతీ మాదిగపల్లెలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించనున్నట్లు పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సివిల్ రైట్స్ డేలో మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి నుంచి పెనాల్టీ షూటవుట్ ఫుట్‌బాల్ టోర్నీ

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవరంలో నేటి నుంచి పెనాల్టీ షూటవుట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు లెవెన్ బుల్లెట్స్ ఫుట్‌బాల్ ఆకాడమీ నిర్వాహకులు సునీల్ తెలిపారు. ఆరోగ్యవరం మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ టోర్నమెంట్‌లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొంటున్నాయన్నారు. టోర్నీ విజేతకు రూ.5వేలు, రన్నర్స్‌కు రూ.3వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. ప్రజలు ఈ టోర్నమెంట్‌ను ఆదరించాలని ఒక ప్రకటనలో కోరారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): క్షయ పట్ల అవగాహన కలిగి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం మండల హెల్త్‌ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ పేర్కొన్నారు. గురువారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. క్షయ రోగులు తీసుకునే జాగ్రత్త, చికిత్సపై వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.